నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, శుక్రవారం 30 మే 2025 | RANGAREDDY

వచ్చే రెండ్రోజులు మోస్తరు వర్షం

సిటీబ్యూరో, మే 29 (నమస్తే తెలంగాణ): రుతుపవనాల ప్రభావంతో గ్రేటర్‌లో పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురుస్తున్నాయి. గురువారం రాత్రి 9 గంటల వరకు అత్యధికంగా నగరలోని కాప్రాలో 3.75 సెం.మీలు,మల్లాపూర్‌లో 3.73 సెం.మీలు, నేరేడ్‌మెట్‌లో 3.38 సెం.మీలు, ఉప్పల్ రాజీవ్‌నగర్‌లో 2.95 సెం.మీలు, మౌలాలిలో 2.63 సెం.మీలు, ఉస్మానియా యూనివర్సిటీలో 2.15 సెం.మీలు, మల్కాజిగిరి ఆనంద్‌బాగ్‌లో 1.98 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు టీజీడీపీఎస్ అధికారులు వెల్లడించారు. రుతుపవనాలు మరింత విస్తరిస్తున్న నేపథ్యంలో రాగల రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 31.0, కనిష్ఠం 23.8 డిగ్రీలు, గాలిలో తేమ 70 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రాన్ని అందిస్తున్న మాజీ మంత్రి సబితారెడ్డి, చిత్రంలో పక్కన మాజీ ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, జైపాల్ యాదవ్ తదితరులు

ఫార్మా రైతులకు స్థలాలేవీ?

- గత ప్రభుత్వం పట్టాలిచ్చినా.. నేటికీ పొజిషన్‌ను చూపని కాంగ్రెస్ సర్కార్
- 18 నెలలుగా అదే కాలయాపన
- రైతుల భూముల్లో కంచె వేయడం దారుణం
- నిషేధిత జాబితా నుంచి రైతుల పేర్లను తొలగించాలి
- మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి డిమాండ్
- పట్టాలు పొందిన రైతులందరికీ స్థలాలివ్వాలని కలెక్టర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, జైపాల్ యాదవ్ తదితరుల బృందం..

రంగారెడ్డి మే, 29 (నమస్తే తెలంగాణ): ఫార్మాసిటీ ఏర్పాటు కోసం భూములిచ్చిన రైతులకు న్యాయం చేయాలనే సదుద్దేశంతో గత ప్రభుత్వం రైతులకు ఇండ్ల స్థలాల పట్టాలిచ్చినా.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వారికి స్థలాలు చూపించలేకపోతున్నదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. గురువారం సబితారెడ్డి నేతృత్వంలో మాజీ ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, జైపాల్ యాదవ్‌తోపాటు పలువురు బీఆర్ఎస్ నేతల బృందం కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసింది. తక్షణమే పట్టాలు పొందిన రైతులకు ఇండ్ల స్థలాలు చూపించాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సబితాఇంద్రారెడ్డి మీడియాతో మాట్లాడుతూ..గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల్లో 14,000 ఎకరాలను సేకరించిందని.. భూములు ఇచ్చిన రైతులకు ఎకరానికి గుంట చొప్పున ఇండ్ల స్థలాల పట్టాలిచ్చిందని గుర్తు చేశారు. రైతుల కోసం సుమారు 600 ఎకరాల్లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం వెంచర్ కూడా ఏర్పాటు చేసిందని.. అందులోనే యాచారం మండలంలోని నాలుగు గ్రామాలకు చెందిన 979 మందికి, కందుకూరు మండలంలోని పలు గ్రామాలకు చెందిన 686 మందికి కూడా ఇండ్ల స్థలాల కోసం పట్టాలిచ్చిందన్నారు. అయితే, 18 నెలల కిందట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నెలలు గడుస్తున్నా వారికి స్థలాలను మాత్రం చూపడం లేదని ఆరోపించారు. ప్రస్తుత కలెక్టర్ నారాయణరెడ్డి గత సంక్రాంతి నాటికే పట్టాలు పొందిన రైతులందరికీ ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ ఫీజులను చెల్లించి మరీ స్థలాలు చూపుతామని హామీ ఇచ్చారని.. మే నెల దాటుతున్నా ఇప్పటికీ స్థలాలనే చూపలేదన్నారు. రైతులకు స్థలాలు చూపకుండా..మరోవైపు నిషేధిత జాబితాలో ఉన్న రైతుల పేర్లను తొలగించకుండానే వారి భూముల్లో కంచె వేయడం సరికాదని వారు పేర్కొన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించిన తర్వాతే ఫెన్సింగ్ వేయాలన్నారు. మరోవైపు ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లో రైతుల మిగులు భూములకు నేటికీ పరిహారం అందలేదని, వారందరికీ చెల్లించాలన్నారు. అలాగే, ఫార్మాసిటీ పేరుతో సేకరించిన భూముల్లో ప్రభుత్వం ఇష్టానుసారంగా ఫ్యూచర్‌సిటీ నిర్మిస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు.

గుర్రంగూడ రైతులకు న్యాయం చేయాలి

జిల్లాలోని గుర్రంగూడ గ్రామంలోని అనేక మంది పేదలు కొన్నేండ్లుగా ప్రభుత్వ భూములను సాగు చేసుకుని జీవిస్తున్నారని, ఆ భూములను ప్రభుత్వం తీసుకోవాలని అనుకోవడం సరికాదని ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. ల్యాండ్ పూలింగ్ ద్వారా ఆ భూములను తీసుకొని హెచ్ఎండీఏ ద్వారా అభివృద్ధి చేసి.. 60: 40 నిష్పత్తిలో రైతుల న్యాయం చేయాలన్నారు. అలాగే, నాదర్‌గుల్ గ్రామంలోని పేదల భూములను ప్రభుత్వం భయపెట్టి తీసుకోవాలని చూస్తున్నదని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, జైపాల్ యాదవ్, వెంకటరమణారెడ్డి, రమేశ్‌గౌడ్, లక్ష్మీనరసింహారెడ్డి పాల్గొన్నారు

తిరుమలాపూర్ పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని తూకం వేయకపోవడంతో టార్పాలిన్లు కప్పి నిలువ చేసిన అన్నదాతలు

పేరుకుపోతున్న ధాన్యం కుప్పలు

- వికారాబాద్ జిల్లాలో సక్రమంగా సాగని కొనుగోళ్లు
- అకాల వర్షాలతో తడిసి ముద్దయి.. మొలకలొస్తూ..
- నష్టపోతున్న అన్నదాత.. పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు

సాల్విడ్ కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లు సక్రమంగా సాగకపోవడంతో ట్రాక్టర్లలోనే నిల్వ ఉంచిన ధాన్యం

కులకచర్ల, మే 29 : రైతే రాజు.. రైతు బాగున్నప్పుడే రాష్ట్రం, దేశం కూడా మంచిగా ఉంటుందని పెద్దలు చెప్తుంటారు. కానీ, రైతు సమస్యల్లో ఉంటే వారిని పట్టించుకోవడంలో సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. వికారాబాద్ జిల్లాలో వరి కోతలు పూర్తయ్యాయి. అన్నదాతలు ధాన్యాన్ని తేమ లేకుండా ఉండేందుకు కల్లాల్లో ఆరబెట్టి.. సమీపంలో ఉన్న కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు తీసుకెళ్తే.. అక్కడి సిబ్బంది.. సరిపడా సంచులు లేవని.. హమాలీల కొరత ఉన్నదని చెబుతూ.. తూకం వేయడంలో నిర్లక్ష్యం చేస్తుండడంతో అన్నదాతలు ఆ వడ్లను అక్కడే కుప్పగా పోసి సంచులు కప్పుతూ.. రోజుల తరబడిగా ఎప్పుడు కొంటారా ..? అని ఎదురుచూస్తున్నారు. అంతేకాకుండా ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లో ఉంచిన ధాన్యం తడిసిపోసి మొలకలు వస్తుండడంతో అన్నదాత కన్నీరు మున్నీరవుతున్నాడు. కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని సెంటర్ల నిర్వాహకులు వెంటనే సేకరించి.. సంబంధిత రైతుల వివరాలను ట్యాబ్‌లో ఓపీఎంఎస్ చేసి ధాన్యాన్ని మిల్లులకు పంపించాల్సి ఉంటుంది. కానీ, కేంద్రాల్లో తూకం చేయపోవడంతో కురుస్తున్న వర్షాలకు తడిసి ముద్ద అవుతున్నాయి. మొలకలు వస్తున్నాయి. ఈ విషయాన్ని పలుమార్లు అధికారులకు చెప్పినా ఫలితం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, మండలంలోని సాల్విడ్ కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లు సక్రమంగా సాగడంలేదు. తూకం వేసిన వడ్లకు తీసుకెళ్లేందుకు లారీలు సరిపడా రాకపోవడంతో ఆ నిల్వలు పేరుకుపోతున్నాయి. తద్వారా తూకం వేయడంలేదు. అన్నదాతలు ట్రాక్టర్లలో తీసుకొచ్చిన ధాన్యాన్ని అలాగే ఉంచాల్సిన పరిస్థితి నెలకొన్నది.

క్వింటాకు మూడు నుంచి నాలుగు కిలోల తరుగు తీస్తూ..

కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని అక్కడి సిబ్బంది రైస్ మిల్లులకు తరలిస్తుండగా.. రైస్‌మిల్లర్లు ఒక్కో దగ్గర ఒక్కో విధంగా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. క్వింటాకు మూడు నుంచి నాలుగు కిలోల వరకు తరుగు తీస్తామని చెబుతున్నారని.. అంత మొత్తంలో తరుగు తీస్తే తమ కేమీ మిగులుతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుప్పలుగా పోసి..

మండలంలోని తిరుమలాపూర్ పీఏసీఎస్ కేంద్రంలో గత వారం, పది రోజులుగా ధాన్యాన్ని తూకం వేయకపోవడంతో.. అన్నదాతలు అక్కడే కుప్పలుగా పోసి టార్పాలిన్లు కప్పారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి పది రోజులు దాటుతున్నా ఇంకా తూకం చేయడం లేదన్నారు. అకాల వర్షాలతో వడ్లు తడి సి పోయే ప్రమాదమున్నదని ఆందోళన చెందుతున్నారు.

డబ్బులు రావడం లేదు..

వడ్లను కొనుగోలు కేం ద్రంలో విక్రయించి 15 రోజులు దాటుతున్నా.. ఇంకా డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదని అన్నదాతలు పేర్కొంటున్నారు. గతంలో ఇలాంటి ఎప్పుడు లేదని.. బీఆర్ఎస్ హయాంలో రెండు మూడు రోజుల్లోనే డబ్బులు తమ బ్యాంకుల్లోకి వచ్చేవని గుర్తు చేసుకుంటున్నారు.

ధాన్యాన్ని సేకరించడం లేదు..

కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్లే తూకం వేసి రైస్ మిల్లులకు తరలించాలి. కానీ, వారు అలా చేయకపోవడంతో.. మిగిలిన రైతులు తమ ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకొచ్చి స్థలం సరిపోకపోవడంతో రోడ్ల పక్కన ఉంచాల్సి వస్తున్నది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి

-గుండుమల్ల నర్సింహులు తిరుమలాపూర్, కులకచర్ల

తరుగు తీస్తూ.. మోసం చేస్తున్నారు..

రైస్‌మిల్లుల నిర్వాహకులు తూకం చేసిన ధాన్యానికి తరుగు తీస్తున్నారు. క్వింటాకు మూడు నుంచి నాలుగు కిలోల వరకు తరుగు తీస్తుండడంతో తమకు తీవ్ర నష్టం జరుగుతున్నది. అతివృష్టి, అనావృష్టి తదితర కారణాలతో పంట దిగుబడి తక్కువగా వచ్చింది. ఇప్పుడు ఇలా తరుగు తీస్తే తమకు మిగిలేది స్వల్పమే. ప్రభుత్వం స్పందించి రైస్‌మిల్లుల నిర్వాహకులు తరుగు పేరిట చేసే మోసాన్ని అరికట్టాలి.

-శివకుమార్, తిరుమలాపూర్, కులకచర్ల

సాల్విడ్ పాఠశాలలో లారీలు రాక నిల్వ ఉంచిన ధాన్యం బస్తాలు

మొక్కుబడిగా సదరం

- 63 మందిలో.. 14 మందికే పరీక్షలు
- సదరం క్యాంపులో గంటన్నర సేపే విధులు నిర్వహించి వెళ్లిపోయిన వైద్యుడు
- డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలంటున్న దివ్యాంగులు

డాక్టర్ కోసం ఎదురు చూస్తున్న దివ్యాంగులు

డాక్టర్ పట్టించుకోలేదు..

నా తమ్ముడు దివ్యాంగుడు. సదరం క్యాంపునకు వెళ్లేందుకు ముందుగానే స్లాట్ బుక్ చేసుకున్నాం. పరిగి నుంచి తమ్ముడిని తీసుకొని వికారాబాద్ ప్రభుత్వ జనరల్ దవాఖానకు వెళ్లా. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అక్కడే ఉన్నా. తాగేందుకు నీళ్లు కూడా లేవు. మూత్రశాలలు కనిపించనే లేదు. 9:30 గంటలకు రావాల్సిన డాక్టర్ 11:30 వచ్చారు. దాదాపు 60 మందికి పరీక్షలు చేయాల్సి ఉండగా.. కేవలం 14 మందికే చేసి మధ్యాహ్నం 1 గంటకు వెళ్లిపోయారు. స్లాట్ బుక్ చేసుకున్న మా పరిస్థితి ఏమిటి.? వైద్య పరీక్షలు నిర్వహించాలని డాక్టర్‌ను కోరితే పట్టించుకోకుండా వెళ్లిపోయారు. కలెక్టర్ స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలి.

-మహ్మద్ ఇక్బాల్, పరిగి

వికారాబాద్, మే 29 : సదరం క్యాంపునకు స్లాట్ బుక్ చేసుకుని వచ్చిన దివ్యాంగులపై డాక్టర్లు, అధికారులు చిన్నచూపు చూస్తున్నారు. గురువారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖానలో దివ్యాంగుల కోసం సదరం క్యాం పును డీఆర్‌డీఏ ద్వారా అధికారులు ఏర్పాటు చేశారు. దాదాపు 35 మంది స్లాట్ బుక్ చేసుకున్నారు. మరో 28 మంది రెన్యువల్ చేసుకోగా వారికి కూడా వైద్యపరీక్షలు నిర్వహించాల్సి ఉన్నది. అయితే, ఉదయం 9:30 గంటలకు రావాల్సిన సంబంధిత డాక్టర్ 11:30 గంటలకు వచ్చారు. 14 మందికి వైద్య పరీక్షలు చేసి మధ్యాహ్నం 1 గంటకు వెళ్లిపోయారు. దాదాపు 63 మందిని పరీక్షించాల్సి ఉండగా కేవలం 14 మందికే పరీక్షలు చేసి వెళ్లడంపై దివ్యాంగులు మండిపడుతున్నారు. ఉదయం 8 గంటలకే దవాఖానకు వచ్చామని.. ఇక్కడ కనీస మౌలిక వసతులు కూడా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యామని పలువురు దివ్యాంగులు వాపోయారు. వైద్యులు, అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఐనాపూర్‌లోని కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, అక్కడి సిబ్బందితో మాట్లాడుతున్న వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

రైతన్నకు ఇబ్బంది కలిగించొద్దు..

- వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్
- 'మొలకెత్తిన ధాన్యం.. రైతన్న దైన్యం'కు స్పందన
- ఐనాపూర్‌లోని కొనుగోలు కేంద్రం సందర్శన

నమస్తే ఎఫెక్ట్

దోమ, మే 28 : రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా సాగాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. బుధవారం మండలంలోని ఐనాపూర్ గ్రామానికి చెందిన అన్నదాతలు మొలకెత్తిన ధాన్యంతో రోడ్డెక్కిన విషయం తెలిసిందే.. మొలకెత్తిన ధాన్యం.. రైతన్న దైన్యం శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆయన గురువారం ఐనాపూర్‌లోని ధాన్యం కోనుగోలు కేంద్రాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను రైతన్నలు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రైతుల నుంచి చివరి గింజా వరకు కొంటామని భరోసా ఇచ్చారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి త్వరగా మిల్లులకు పంపించాలని కొనుగోలు కేంద్రం సిబ్బందికి సూచించారు. గతేడాది కంటే ఈ ఏటా ధాన్యాన్ని పెద్ద మొత్తంలో కొనుగోలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నరసింహులు, ఆర్ఐ సుదర్శన్, రెవెన్యూ సిబ్బంది ,పోలీసులు, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.



కోట్ల విలువైన భూమికి ఎసరు

- ఫోర్జరీ సంతకాలతో తప్పుడు ప్రొసీడింగ్స్
- చెరువు భూములను ఆక్రమించుకునేందుకు కుట్ర
- పోలీసులకు కలెక్టర్ ఫిర్యాదు.. నిందితుడిపై కేసు నమోదు

మణికొండ, మే 29 : నగర శివారు ప్రాంతంలోని గండిపేట మండలంలో తప్పుడు డాక్యుమెంట్లతో దాదాపు రూ. రెండు వేల కోట్ల విలువైన భూమిని కబ్జా చేసేందుకు ఘరానా మోసగాడు యత్నించాడు. గండిపేట మండలం నెక్నాంపూర్ గ్రామ సర్వేనంబర్ 44 లో చెరువు, 20లో ఎఫ్‌టీఎల్ ఉన్నట్లు కొద్ది రోజుల కిందట అధికారులు గుర్తించారు. టోలిచౌకి ప్రాంతానికి చెందిన ఇబ్రహీం అనే వ్యక్తి 50 ఏండ్ల కిందట తాము 30 ఎకరాల భూమిని కొన్నట్లు తప్పుడు ఫోర్జరీ పత్రాలను సృష్టించాడు. ఈ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు అప్పటి రంగారెడ్డి కలెక్టర్ భారతి సంతకాన్ని ఫోర్జరీ చేసి ఉత్తర్వులు రూపొందించాడు. గండిపేట తహసీల్దార్‌గా వేణుగోపాల్ అనే వ్యక్తి పేరును సృష్టించి ప్రొసీడింగ్స్‌ని సిద్ధం చేశారు. వీటి ఆధారంగా ధరణి పోర్టల్‌లో తమ పేర్లను చేర్చాలంటూ మూడు నెలల కిందట రంగారెడ్డి కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. ఆ దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ వాటిని తిరస్కరించారు. ఇబ్రహీం అనే వ్యక్తి తప్పుడు ఫోర్జరీ పత్రాలతో ప్రభుత్వ స్థలాన్ని కాజేయాలని కుట్రతో కోర్టునూ తప్పు తోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాడని తక్షణమే విచారించి అతడిపై కేసు నమోదు చేయాలని మూడు నెలల కిందట నార్సింగి పోలీసులను కలెక్టర్ ఆదేశించారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు ఇబ్రహీం చెరువును చెరపట్టేందుకే అక్రమార్కులు ఫోర్జరీ పత్రాలను సృష్టించారని గుర్తించారు.

30 ఎకరాలను వశం చేసుకునేందుకు..

ఇబ్రహీం రూ. రెండు వేల కోట్ల విలువైన సుమారు 30 ఎకరాల భూమిని కబ్జా చేసేందుకు యత్నించి.. అప్పటి కలెక్టర్ భారతి సంతకాలతో న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసినట్లు పోలీసులు తేల్చారు.

దరఖాస్తుదారు పిటిషన్‌ను విచారించిన హైకోర్టు ఫిర్యాదుదారుడి దరఖాస్తును పరిశీలించాలని ఈ ఏడాది జనవరిలో ఆదేశించింది. అప్పటి కలెక్టర్ భారతి ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను అధికారులు పూర్తిస్థాయిలో విచారించగా ఎక్కడ ప్రొసీడింగ్స్ ఇచ్చినట్లు నిర్ధారణ కాలేదు. ఇబ్రహీంచెరువు భూములను వ్యవసాయేతర భూములుగా మార్చేందుకు తహసీల్దార్‌గా వేణుగోపాల్ ఇచ్చినట్లు తప్పుడు ఫోర్జరీ పత్రాలను సృష్టించినట్లుగా పోలీసులు తేల్చారు. 2024లో తహసీల్దార్ వేణుగోపాల్ రిజిస్ట్రేషన్ చేసినట్లుగా తప్పుడు ఫోర్జరీ పత్రాలను చూపించారు. ఇవన్నీ పోలీసుల విచారణలో తేలడంతో నిందితుడు ఇబ్రహీంపై కేసు నమోదు చేసి జైలుకు పంపుతామని నార్సింగి పోలీసులు తెలిపారు.